క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి


జొన్న నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా సివిల్ సప్లయీస్ అధికారులు

బొమ్మనహాళ్: జొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సివిల్ సప్లై మేనేజర్ రమేష్‌రెడ్డి, వ్యవసాయాధికారి సాయికుమార్ తెలిపారు. మంగళవారం సిద్దరాంపురంలో జొన్న నిల్వలను సివిల్ సప్లై అధికారులు పరిశీలించారు. సివిల్ సప్లై మేనేజర్ రమేష్‌రెడ్డి, ఏఓ సాయికుమార్ మాట్లాడుతూ 2024–25 రబీ సీజన్‌లో మండలంలో 2,639 ఎకరాల్లో రైతులు జొన్న పంట సాగు చేశారన్నారు. ఎక్కువగా మండలంలోని బొల్లనగుడ్డం, సిద్దరాంపురం, హరేసముద్రం, కురువల్లి, గోనేహాళ్ గ్రామాల్లో జొన్న పంట సాగైనట్లు తెలిపారు. క్వింటా హైబ్రిడ్ జొన్నలు రూ.3,371తో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, కణేకల్లు స్టాక్ పాయింట్ ఆఫీసర్ సుధాకర్, సొసైటీ సీఈఓ హనుమంతు పాల్గొన్నారు.

ముస్లింలపై కుట్రతోనే వక్ఫ్ సవరణ బిల్లు


అరబిక్ హైస్కూల్ మర్కస్ మసీదు ఆవరణలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

ఉరవకొండ: ముస్లింలపై కుట్రలో భాగంగానే వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెట్టారని, మత విద్వేషాలు రెచ్చగొట్టడమే బీజేపీ ప్రధాన అజెండా అని రాయలసీమ ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అన్సర్ రహంతుల్లా అన్నారు. మంగళవారం స్థానిక అరబిక్ హైస్కూల్ వద్ద మర్కస్ మసీదు వద్ద వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించడాన్ని నిరసిస్తూ ఆర్ఎంఎం ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ మత పెద్దలు, ముస్లింలు నిరసన తెలియజేశారు. ఆర్ఎంఎం అధ్యక్షుడు రహంతుల్లా మాట్లాడారు. బీజేపీతో పాటు బిల్లుకు మద్దతుగా ఓటేసిన పార్టీలకు ముస్లింలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంఎం నాయకులు జిలాన్, ఇర్ఫాన్, రఫీక్, జిలాన్ పాల్గొన్నారు.

'ఉన్నతి' ద్వారా ఉద్యోగావకాశాలు


మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ మల్లికార్జున

కూడేరు: డీఆర్‌డీఏ 'ఉన్నతి' ద్వారా ఉపాధి హామీ పథకం కింద 100 రోజులు పని దినాలు పూర్తయిన కుటుంబాల్లో యువతీయువకులకు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా కోఆర్డినేటర్ మల్లికార్జున తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ కుళ్లాయిస్వామి అధ్యక్షతన ఉపాధి సిబ్బందికి 'ఉన్నతి' కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల్లో 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చదివిన యువతీయువకులుంటే గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ తులసీ ప్రసాద్, ఈసీ రవికుమార్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'ఉపాధి' ఉద్యోగుల బదిలీ

కూడేరు: మండల ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. మంగళవారం బదిలీ అయిన పలువురు ఉద్యోగులు రిలీవ్ అయ్యారు. ఏపీఓ తులసీ ప్రసాద్ ఉరవకొండ మండలానికి, ఈసీ రవికుమార్ శింగనమల మండలానికి, టెక్నికల్ అసిస్టెంట్లు లక్ష్మీనారాయణ రాప్తాడుకు, సుగుణ గార్లదిన్నెకు , కంప్యూటర్ ఆపరేటర్ గీత కంబదూరుకు బదిలీ అయ్యారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి


ఆశ వర్కర్లకు యూనిఫాం పంపిణీ చేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలందించాలని మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మండల వ్యాప్తంగా ఉన్న ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం 54 మంది ఆశ వర్కర్లకు యూనిఫాం అందించారు. సీహెచ్ఓ రాణీ ఎస్తేర్ , సూపర్‌వైజర్ రామలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కందిపప్పు కరువు

- నాలుగు నెలలుగా నిలిచిపోయిన సరఫరా
- గాడితప్పిన ప్రజాపంపిణీ వ్యవస్థ
- పేదల ఆకలిబాధలు పట్టించుకోని కూటమి సర్కార్


రాయదుర్గంలోని చౌకదుకాణం వద్ద సరుకుల కోసం పడిగాపులు కాస్తున్న కార్డుదారులు

రాయదుర్గం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా పంపిణీ వ్యవస్థ గాడి తప్పింది. రేషన్‌కార్డు దారులకు నిత్యావసరాలు (పీడీఎస్) పంపిణీ అరకొరగా సాగుతోంది. హిందూ, ముస్లింలు అతి పెద్ద పండుగగా భావించే ఉగాది, రంజాన్, శ్రీరామ నవమికి కూడా పిడికెడు కందిపప్పు సరఫరా చేయలేదు. బియ్యం, అరకొర పంచదారతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో పేదింట పప్పన్నం కరువైంది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 504 చౌక దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలోని ఏఏవై 16,745, తెల్ల రేషన్‌కార్డులు 1,84,770 మొత్తం 2,01,515 రేషన్‌కార్డులు ఉన్నాయి. సుమారు 202 టన్నులు కందిపప్పు రేషన్ దుకాణాలకు దిగుమతి చేయాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా 6.60 లక్షల రేషన్‌కార్డులు ఉండగా, 540 టన్నుల కందిపప్పు అవసరం కానుంది. అయితే గత నాలుగు నెలలు నుంచి అరకొర పంపిణీతోనే సరిపెట్టారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు, గోధుమ పిండి, రాగులు క్రమం తప్పకుండా ఇంటివద్దే పంపిణీ చేశారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక ఎండీఎం వాహనాలను సైతం సక్రమంగా నడపకపోగా, నిత్యావసర సరుకుల్లోనూ కోతపెట్టింది. దీంతో పేదలకు ఆకలిబాధలు మిగిల్చింది.

పెరిగిపోతున్న కంది పప్పు ధర

ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా కంది పప్పు సరఫరా నిలిచిపోవడంతో ధరలు క్రమేణా పెరుగుతున్నాయి. చౌక దుకాణాల్లో ప్రభుత్వం రాయితీపై కిలో రూ.67కే అందించారు. నాలుగు నెలల నుంచి ఈ ప్రక్రియ ఆగిపోయింది. దీంతో మార్కెట్లో ధరలు అంతకంతకూ పెరిగాయి. ప్రస్తుతం కిలో కందిపప్పు రూ.115 నుంచి రూ.120కు చేరింది. పంచాదార పరిస్థితి అలానే ఉంది. రాయితీపై అరకేజీ పంచదార రూ.17 కే పేదలకు దక్కేది. ఇప్పుడు మార్కెట్లో రూ.24 వరకు పెరిగింది. నాణ్యత ఆధారంగా మరింత ఎక్కువే చెల్లించుకోవాల్సి వస్తోంది. పండు రోజు కూడా ఓళిగలు చేసుకోలేక చాలా మంది పరమాన్నంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో కూటమి సర్కార్ తీరుపై కార్డుదారులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

బియ్యం పంపిణీలోనూ అస్తవ్యస్తం

బియ్యం పంపిణీ కూడా సక్రమంగా సాగలేక పోతుంది. చౌక దుకాణాపు డీలర్లు తుకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. 20 కిలోలు తూకం పెడితే స్కేలుపై రెండు డబ్బాలు ఉంచి తూకం వేస్తారు. దీంతో 3 కిలోలు తక్కువ వస్తోందని కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక డీలర్లను మొత్తంగా మార్చేసి వారి అనుయాయులను నియమించుకుంది. ఎండీఎం వాహనాల ద్వారా పంపిణీ చేస్తే తమకేంటీ లాభం అన్నట్టు వాహనాలను తిప్పనీకుండా కార్డుదారులను చౌకదుకాణాల చుట్టూ తిప్పుకుంటున్నారు. ప్రతి నెలా క్వింటాళ్ల కొద్దీ పక్కదారి పట్టిస్తున్నారు. సీఎస్ డీటీలు చూస్తున్నా కట్టడి చేయలేక చేతులెత్తేస్తున్నారు.

కందిపప్పు పంపిణీ చేయలేదు



చౌకదుకాణాల్లో బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. నాలుగు నెలల నుంచి కందిపప్పు సరఫరా పూర్తిగా ఆపేశారు. రంజాన్ పండుగకైనా కందిపప్పు ఇస్తారని చాలా మంది ఆశగా ఎదురుచూశారు. కనీసం పండుగ తర్వాత పంపిణీ చేసే ఈ నెల కూడా అందించలేక చేతులెత్తేశారు. నిత్యావసర సరుకులు పూర్తి స్థాయిలో అందించి పేదలను ఆదుకోవాలి.

– షాహీద్‌బాను, ఓబుళాచారి రోడ్డు, రాయదుర్గం

ప్రజా పంపిణీ వ్యవస్థ గాడి తప్పింది



ప్రజా పంపిణీ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్డుదారులు అధ్వాన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో అన్ని రకాల సరుకులను ఎండీఎం వాహనాల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేశారు. ప్రస్తుతం ఈ పరిస్థితులు కనిపించడం లేదు. నాలుగు నెలలుగా కందిపప్పు సరపరా నిలిచిపోయింది. దీంతో పేదింట పప్పన్నం కరువైంది. నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ జరగకపోతే కార్డుదారులతో కలసి ఉద్యమించాల్సి వస్తుంది.

– మేకల శ్రీనివాసులు, డీలర్ల సంఘం మాజీ అధ్యక్షుడు, రాయదుర్గం

వీఆర్‌ఓపై చర్యలు తీసుకోండి


ఆర్‌డీఓకు వినతిపత్రం అందిస్తున్న బాధిత రైతులు

కళ్యాణదుర్గం రూరల్: వీఆర్‌ఓ వెట్టి తిమ్మయ్యపై చర్యలు తీసుకోవాలని కుందుర్పికి చెందిన వెంకటేశులు, నాగలక్ష్మి ఆర్డీఓ వసంతబాబుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కనగానపల్లి మండలం తరగకుంటలో 2001లో సర్వేనం .371లో ప్రభుత్వం పలువురికి భూమి పంపిణీ చేసినట్లు తెలిపారు. అయితే కుందిర్పి మండలంలోని అపిలేపల్లిలో వీఆర్‌ఓగా పని చేస్తున్న వెట్టి తిమ్మయ్య సర్వేనం.371లో ఐదెకరాల భూమిని తన పేరిట చేయించుకున్నట్లు ఆరోపించారు. దీనిపై అనేక మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు. కార్యక్రమంలో రైతులు, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ నియామకం

ఉరవకొండ: స్థానిక గుడ్ షెఫర్డ్ చర్చి ఆవరణలో క్రైస్ట్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈకార్యవర్గంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆనంద్, ఉపాధ్యక్షులుగా ప్రమవీలా జోసఫ్, బెన్సన్, కార్యదర్శి జాషువా, గౌరవ అధ్యక్షుడిగా ఆరోగ్యనాథ్, ఉప కార్యదర్శిగా విక్రమ్, ఈసీ సభ్యులుగా కుమారి, భాస్కర్, లేపాక్షి ఎంపికయ్యారు. ఈసందర్భంగా అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడారు. క్రిస్టియన్ల హక్కుల సాధన కోసం కృషి చేస్తామన్నారు.క్రిస్టియన్లపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి క్రిస్టియన్ అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు


వజ్రకరూరు మండలం గూళ్యపాళ్యంలో రాతి దూలం లాగుతున్న వృషభాలు


ఉరవకొండ మండలం బూదగవిలో ఎర్రిస్వామికి నగదు అందిస్తున్న నిర్వాహకులు

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యం గ్రామంలో సీతారామస్వామి రథోత్సవ వేడుకలను (శ్రీరామనవమి)పురస్కరించుకుని మంగళవారం రాతి దూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. గ్రామానికి చెందిన జంగుడదొడ్ల లక్ష్మయ్య ఎద్దులు ప్రథమస్థానంలో నిలిచాయి. బ్లిశంకరయ్య ఎద్దులు రెండో స్థానంలో నిలిచాయి. జంగా కళ్యాణ్ ఎద్దులు మూడవస్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతి రూ.5,000 గ్రామానికి చెందిన కారు డ్రైవర్లు అందచేశారు. ద్వితీయ బహుమతి రూ.3,000 మాజీ సర్పంచు రామయ్య, తృతీయ బహుమతి రూ.2,000 చాకలి రంగస్వామి అందచేశారు. కార్యక్రమంలో మైక్‌సెట్ యాంకర్ నారాయణ, ఆర్గనైజర్లు వన్నూరుస్వామి, కళ్యాణ్, రాజు, కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: మండలంలోని బూదగవిలో వెలసిన అభయ ఆంజనేయస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు మంగళవారం నిర్వహించారు. పోటీల్లో 10 జతల ఎద్దులు పోటీపడ్డాయి. బొమ్మనహాల్ మండలానికి చెందిన ఎర్రిస్వామి ఎద్దులు మొదటి స్థానం (రూ.20 వేల బహుమతి)లో నిలిచాయి. రెండో స్థానం(రూ.10వేలు)లో పూజారి బండయ్య, మూడో స్థానంలో బసన్న ఎద్దులు నిలిచాయి. కార్యక్రమంలో ఛత్రగుడి చిరంజీవి, ఛత్రగుడి సుధాకర్, గాదిలింగ, అఖిల్, లాలుస్వామి తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై జంబుకేశ్వరుడి దర్శనం


శేషవాహనంపై ఊరేగుతున్న జంబుకేశ్వరుడు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన శ్రీస్వయంభూ జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో కనులపండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి హాజరైన భక్తులకు తీర్థప్రసాదం గావించారు. అనంతరం సాయంత్రం స్వామివారి శేషవాహనం కోట వీధుల మీదుగా వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు మీదుగా బొడ్డు రాయి వరకు ఊరేగించారు. అక్కడి నుంచి తిరిగి స్వామి వారి వాహనం ఆలయానికి చేరుకుంది. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారి కైలాస వాహనోత్సవం జరుగుతుందని ఆలయ కార్య నిర్వహణాధికారి కె.నరసింహారెడ్డి తెలిపారు.

వ్యాఘ్ర వాహనంపై ఆది దంపతులు


ఊరేగుతున్న శివపార్వతులు

కూడేరు: కూడేరులో ప్రఖ్యాతిగాంచిన శివపార్వతుల స్వయంభు జోడు లింగాల సంగమేశ్వర స్వామి బ్రహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం ఉదయం జోడు లింగాలకు అర్చకులు రుద్రాభిషేకం చేశారు. రాత్రి 8 గంటలకు ఆలయం నుంచి శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఆంజనేయ స్వామి ఆలయం వరకూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ ఈడిగ సంఘం ఆధ్వర్యంలో వ్యాఘ్ర వాహనంపై శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఉంచి ప్రత్యేక పూజలు చేయించారు.అనంతరం మంగళవాయిద్యాల నడుమ పీర్ల చావిడి వరకు ఊరేగించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది, ఈడిగ కులస్తులు, ప్రజలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో పోషణ్ పక్వాడ్ పోస్టర్లను ఆర్‌డీఓ వసంత్‌బాబు, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, అధికారులు విడుదల చేశారు. పౌష్టికాహార ప్రాధాన్యతపై ఈనెల 8 నుంచి 22 వరకు ప్రత్యేక కార్యక్రమాలు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించాలన్నారు. ఎంపీడీఓ రామచంద్ర, మెడికల్ ఆఫీసర్ రాజేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి

బొమ్మనహాళ్: సమాజంలోని ప్రతి ఒక్కరూ బాలికా విద్యను ప్రోత్సహించాలని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారులు కుమారరాజా, గీతాభార్గవి అన్నారు. గోనేహాళ్‌లోని ప్రాథమిక పాఠశాలలో 'మేము పిల్లలం..అప్పుడే కాము తల్లులం' కార్యక్రమంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పర్యటనకు తరలిన నాయకులు


రాయదుర్గం నుంచి నాయకులు, కార్యకర్తలతో బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం/బొమ్మనహాళ్/విడపనకల్లు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి పర్యటనకు వచ్చిన సందర్భంగా రాయదుర్గం నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అనుభంద సంఘాల అధ్యక్షులు తరలివెళ్లారు. నియోజకవర్గంలోని డి హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, గుమ్మఘట్ట, రాయదుర్గం పట్టణం, మండలం నుంచి అభిమాన నాయకుడ్ని చూసేందుకు వేలాది మంది పార్టీ జెండాలు చేతపట్టి స్వచ్ఛందంగా కలిలారు. ఈ సందర్భంగా జై జగన్ నినాదాలు హోరెత్తించారు. మెట్టు వెంట అన్నీ మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, రాష్ట్ర, జిల్లా, తాలూక కమిటీ నాయకులు, ఆయా మండలాల ఎంపీపీ, జెడ్పీటీసీ, మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. అలాగే విడపనకల్లు మండలంలోని గడేకల్లు, డొనేకల్లు, హంచనహాళ్, మాళాపురం,పెద్ద కొట్టాలపల్లి ,చీలకగురికి, పాల్తూరు,హావళిగి, వి.కొత్తకోట,విడపనకల్లు,పాలికి గ్రామాల నుంచి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కురబ రమేష్ అధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పాపిరెడ్డిపల్లికి తరలి వెళ్లారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి భరత్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కరణం భీంరెడ్డి, సర్పంచు ఉమాశంకర్, హంపయ్య,ప్రసాత,వడగూరు బద్రి,మంతప్ప, వీరన్న, షేక్షావలి, భీమలింగ, తదితరులు ఉన్నారు.


విడపనకల్లు నుంచి బయలుదేరిన మండల కన్వీనర్, నాయకులు

సంక్షిప్త సమాచారం

గ్యాస్ ధరలు తక్షణమే తగ్గించాలి

రాయదుర్గంటౌన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరను తక్షణమే తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సామాన్య పేద, మధ్య తరగతి ప్రజల నడ్డివిరిచే ఏకంగా సిలిండర్ ధరను రూ.50 పెంచడం దారుణమన్నారు. ఇప్పటికే నిత్యావసర ధరల పెరుగుదలతో కుదేలవుతున్న పేదలపై గ్యాస్ భారం మరింత భారమవుతుందన్నారు. కార్పొరేట్ వ్యక్తులకు ఊడిగం చేసేందుకు మోదీ సర్కారు గ్యాస్ ధరను పెంచినట్లు ధ్వజమెత్తారు. పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని, లేనిపక్షంలో ప్రజల తరఫున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

పన్ను చెల్లింపులపై 5 శాతం రాయితీ పొందండి

రాయదుర్గంటౌన్: ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల చెల్లింపులపై 5 శాతం రాయితీ (డిస్కౌంట్) ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. నెలాఖరులోపు ఇంటి, ఖాళీ స్థలాల పన్ను ఏక మొత్తంలో చెల్లిస్తే 5 శాతం రాయితీ లభిస్తుందన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌లోగాని, సచివాలయంలో గానీ చెల్లించొచ్చన్నారు.

పన్నులు చెల్లించాలి

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం మున్సిపాలిటి పరిధిలోని ప్రజలు ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్ను వెంటనే చెల్లించాలని మున్సిపాల్ కమిషన్ వంశీ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. పన్ను బకాయి ఉన్నవారు ఏక మొత్తంలో ఈ నెల 30 లోపు చెల్లిస్తే ప్రభుత్వం 5 శాతం రాయితీ కల్పిస్తుందన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేయాలి

కూడేరు: ప్రజలు రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రతలను తెలియజేయాలని హెల్త్ సూపర్‌వైజర్ యశోద ఆశావర్కర్లకు సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశావర్కర్లతో సూపర్‌వైజర్ యశోద సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నూతన రథం తయారీకి విరాళం

కూడేరు: కూడేరులో ప్రసిద్ధిగాంచిన జోడు లింగాల సంగమేశ్వర స్వామి నూతన రథానికి ముద్దలాపురానికి చెందిన పెద్దన్న రూ.10116 విరాళం మంగళవారం అందించారు. గ్రామానికి ఇచెందిన పలువురు దాతలు రూ.10116 నుంచి రూ.50,116 వరకు రూ.4 లక్షల వరకు విరాళాలు అందించారు.

ఘనంగా మారెమ్మ ఉత్సవం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కుందుర్పి: మండలంలోని కలిగొలిమి అటవీప్రాంతంలో వెలసిన కొండ్లో మారెమ్మ ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఇటు కుందుర్పి మండలం నుంచేగాక కర్ణాటక నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.

10 నుంచి మల్లేశ్వరస్వామి రథోత్సవం

ఉరవకొండ: పట్టణంలో భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మల్లేశ్వరస్వామి రథోత్సవం ఈనెల 10 నుంచి ప్రారంభం కానుంది. ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. 10న ధ్వజారోహణ, 11న భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం, అనంతరం నందివాహనంపై మల్లేశ్వరస్వామి వారి దర్శనం, 12న స్వామి వారి మహా రథత్సవం, 13న లంకాదహనం, 14న ధ్వజారోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ అర్చకులు బసవరాజు, హంపయ్యస్వామి, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

బెళుగుప్ప: మండల కేంద్రంలోని వాసవీ కల్యాణ మంటపం పక్కనే ఉన్న స్థలంలో బుధవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఆర్‌డీఓ వసంతబాబు తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ షర్మిల, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆర్డీఓ వేదికను పరిశీలించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొంటారన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు.

అంబేద్కర్ చిత్రపటాల అందజేత

ఉరవకొండ: స్థానికంగా 58 ప్రభుత్వ కార్యాలయాలకు జై భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలను మంగళవారం అందించారు. జైభీమ్ యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు తమన్న మాట్లాడుతూ ఈనెల 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రతి ప్రభుత్వకార్యాలయంలోనూ అంబేద్కర్ చిత్రపటం ఉంచేందుకు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో జైభీమ్ యువజన సంఘం కార్యదర్శి లేపాక్షి, రాజేష్, ఈసీ సభ్యులు బండారు మోహన్, సూర్యనారాయణ, సునీల్, రాము, మనీ అజిత్, దీపు, కార్తీక్, లక్ష్మీనారాయణ, హనుమేష్, సుధాకర్‌లు పాల్గొన్నారు.

వ్యవసాయ తోటలో డ్రిప్ పరికరాలు దగ్ధం

బెళుగుప్ప: మండలంలోని నరసాపురానికి చెందిన రైతులు వెంకటలక్ష్మి, వసంతమ్మకు చెందిన ఐదు ఎకరాల మొక్కజొన్న తోటలోని డ్రిప్ పరికరాలు మంగళవారం దగ్ధమయ్యాయి. మొక్కజొన్న తోటలో నూర్పిడి అనంతరం డ్రిప్ పరికరాలను తొలగించే లోపు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో సుమారు రూ.లక్ష నష్టపోయినట్లు బాధితులు తెలిపారు.

వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం


కరకముక్కలలో చెన్నకేశవస్వామి రథోత్సవ దృశ్యం


వెంకటంపల్లిలో శ్రీరామ రథోత్సవ దృశ్యం

విడపనకల్లు: మండలంలోని కరకముక్కలలో చెన్నకేశవ స్వామి మహా రథోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. చెన్నకేశవస్వామి ప్రతిమను అలంకరించి, రథంలో ఉంచి రథాన్ని బసవన్న గుడి వరకు భక్తులు లాగారు. ఉదయంలో చెన్నకేశవస్వామి ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవ వేడుకలను తిలకించాడానికి భక్తులు మిద్దెలపై నుంచి రథోత్సవాన్ని తిలకించారు. పాల్తూరు, హావళిగి, విడపనకల్లు, చీకలగురికి, ఉండబండ, ఉరవకొండ , కర్ణాటకలోని రూపనగుడి, శంకరబండ, బళ్లారి, గడేకల్లు, గుంతకల్లు తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. అంతకుముందు చెన్నకేశవస్వామికి మహిళలు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. సర్పంచు రామాంజనరెడ్డి, ఎంపీటీసీ కురుబ మల్లికార్జున, రాము రెడ్డి, జగదీష్‌రెడ్డి, కురుబ మహేశ్ పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా శ్రీరామ రథోత్సవం

కుందుర్పి: మండలంలోని వెంకటంపల్లిలో సోమవారం అర్ధరాత్రి శ్రీరామస్వామి రథోత్సవం నేత్ర పర్వంగా సాగింది. వందలాది మంది భక్తుల మధ్య మంగళవాయిద్యాలు, మేళతాళాలతో రథాన్ని ఆలయం నుంచి వీధుల గుండా లాగారు. దారి పొడువునా భక్తులు తమలపాకులు,అరటి పండ్లు రథంపై వేసి, మొక్కులు తీర్చుకున్నారు. కుందుర్పి పోలీసులు ఉత్సవంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.